
## క్లుప్తంగా

### ఘనంగా మారెమ్మ ఆలయ వార్షికోత్సవం



కోవెలకుంట్ల: పట్టణంలోని అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ ఆలయ రెండో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మనోహర్‌రావు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మధుబాబు, గువ్వల రామకృష్ణారెడ్డి, కానాల రవీంద్రనాథరెడ్డి, ఉసేనప్ప, మైకేల్, పుల్లయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### డిగ్రీ కళాశాలకు స్పోర్ట్స్ కిట్



స్పోర్ట్స్ కిట్స్ అందుకున్న విద్యార్థులు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దాత మార్లెళ్ల శ్రీనివాసరెడ్డి సహకారంతో వివేకానంద సేవా సమితి సభ్యులు రూ.12 వేల విలువైన స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ భారతి సమక్షంలో వీటిని అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, కార్యదర్శి రంగయ్య, సభ్యుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



కొలిమిగుండ్ల: మండల పరిధిలోని మదనంతపురంలో సోమవారం విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన పైల ప్రతాప్ ఇటీవల రూ.50 వేలు వెచ్చించి గేదెను కొనుగోలు చేశాడు. కృష్ణారెడ్డి అనే రైతు వాగు సమీపంలో వ్యవసాయ పొలం కోసం బోరు ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడే విద్యుత్ తీగలు కింద ఉండటంతో మేతకు వెళ్లిన గేదె తీగలు తగలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. విద్యుత్ తీగలు కింద ఏర్పాటు చేయడం వల్లే గేదె చనిపోయిందని బాధితుడు బోరు యజమానిని ప్రశ్నించడంతో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ప్రతాప్ ఆవేదన వ్యక్తం చేశాడు.

### ప్రకృతి ఆహారం ఉత్తమం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్

బనగానపల్లె రూరల్: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని ప్రకృతి వ్యవసాయం బనగానపల్లె డివిజన్ ఇన్‌చార్జ్ విజయభాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటల్లో ఎలాంటి రసాయన మందులు వినియోగించరన్నారు. కేవలం పశువుల పేడ తదితర సేంద్రియ పద్ధతులు పాటిస్తారని తెలిపారు. కైప ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ లత, ఆదినారాయణ, సోమశేఖర్, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

### అబ్దుల్లాపురంలో పైప్‌లైన్ ఏర్పాటు



పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న కూలీలు

కొలిమిగుండ్ల: అబ్దుల్లాపురంలో అదానీ సిమెంట్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సోమవారం పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. గ్రామంలోని పాత పైప్‌లైన్లతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతుండేవి. కొత్తగా పైపులైన్ నిర్మించాలని గ్రామ పంచాయతీ తరఫున కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి ప్రధాన వీధి మీదుగా ఎస్సీ కాలనీ వరకు పైపులైన్ నిర్మాణ పనులు చేస్తున్నారు.

### సీసీరోడ్డు నిర్మాణానికి వినతి



ఎంపీడీఓ సమస్యను విన్నవిస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల: కొలుములపల్లె ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం తమ కాలనీలో కొంత మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేసి, మరో కాలనీలో వేయడానికి అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలిపారు. పూర్తి స్థాయిలో సీసీరోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు.

# పశు వైద్యం.. దైన్యం

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- రెండు పశు వైద్యశాలలకు ఒక్కరే డాక్టర్
- వెటర్నరీ అసిస్టెంట్‌లు, కాంపౌండర్ పోస్టులు ఖాళీ




సిబ్బంది లేక తెరుచుకోని అంకిరెడ్డిపల్లె పశువైద్యశాల

కొలిమిగుండ్ల: పశువైద్యశాలల్లో తగినంత సిబ్బంది లేక మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు. వ్యవసాయం తర్వాత పాడిపరిశ్రమ అతి ముఖ్యమైంది. ఇటీవల కాలంలో గ్రామాల్లో పాడిగేదెల పెంపకం అధికమైంది. మండలంలో కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లెలో పశువైద్యశాలలు ఉన్నాయి. కొలిమిగుండ్ల పశువైద్యాధికారిణిగా విధులు నిర్వహిస్తున్న పద్మావతి లాంగ్‌లీవ్‌లో వెళ్లిపోయారు. దీంతో ఉన్నతాధికారులు అంకిరెడ్డిపల్లెలో పనిచేసే డాక్టర్ రమేష్‌బాబుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. రెండు పశువైద్యశాలల్లో వెటర్నరీ అసిస్టెంట్‌లు, కాంపౌండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు చోట్ల ఉన్న ఒక్క డాక్టర్‌రే చూసుకోవాల్సి వస్తోంది. అంకిరెడ్డిపల్లెలో ఇటీవల కాలంలో మహిళలు ఎక్కువగా గేదెలు తెచ్చుకొని పాల వ్యాపారం ప్రారంభించారు. గ్రామంలో పాడిపరిశ్రమ గణనీయంగా పెరిగిపోయింది. మూగజీవాలకు వ్యాధులు వస్తే వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తెరుచుకోవడం లేదు. దీనికి తోడు భవనాల రంగులు నెరిసిపోయి కలావిహీనంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో 10 వేలకు పైగానే పాడిగేదెలు ఉన్నాయి. సిబ్బంది సమస్యతో సకాలంలో మూగజీవాలకు వైద్యం అందడంలో జాప్యం చోటు చేసుకుంటోంది. పాల ఉత్పత్తి పెంచేందుకు ఎముకల పొడి, కాల్షియం, తదితర మందులు అరకొరగానే ఉన్నాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ మందుల దుకాణాలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. వైద్య సిబ్బంది లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో గోపాలమిత్రలతో డబ్బులు వెచ్చించి వైద్యం చేయించుకుంటున్నారు. రెండు ఆస్పత్రుల్లో తగినంత సిబ్బందిని నియమించాలని పాడిరైతులు కోరుతున్నారు.

## వేడుకగా శివపార్వతుల పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఏక శిలారూపంలోని స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పాడిరైతులకు అందుబాటులో ఉండాలి



మెట్టుపల్లెలో రికార్డులను పరిశీలిస్తున్న పశువైద్యురాలు

అవుకు: పశువైద్య సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పశువులకు వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని పశువైద్యాధికారిణి భారతీదేవి అన్నారు. సోమవారం అవుకు మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం వ్యాక్సినేషన్, పేషెంట్, మూవ్‌మెంట్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఏహెచ్‌ఏలు సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సీజన్‌కు తగినట్టు పాడిరైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించాలని సూచించారు.

## నేటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓలు

బేతంచెర్ల: మండలంలోని 74 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జ్ఞానజ్యోతి 120పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓలు సోమశేఖర్, అబ్రహం తెలిపారు. పట్టణంలోని హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూల్‌లో 37 మంది, మెయిన్ జెడ్పీ హైస్కూల్‌లో 37 మంది చొప్పున అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఉంటుందని చెప్పారు. చిన్నారులకు ఏ విధంగా బోధించాలనే అంశంపై డీఆర్‌పీలు నాయక్, నాగరాజు, సోమన్న, రేణుక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ శిక్షణ ఇస్తారని వెల్లడించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పక హాజరుకావాలన్నారు.

## ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం



శీలం భాస్కర్ నాయుడును సత్కరిస్తున్న వాల్మీకి న్యాయవాదులు

డోన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని వాల్మీకి సంఘం న్యాయవాదుల జేఏసీ నూతన రాష్ట్ర కన్వీనర్ శీలం భాస్కర్ నాయుడు తెలిపారు. స్థానిక క్లబ్ హౌస్ ఆవరణలో వాల్మీకి సంఘం న్యాయవాదులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. త్వరలోనే అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను కలిసి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు మద్దతు ఇవ్వాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణమూర్తి, పూల శీను, పాలరాజు, నాగేంద్ర, శివరామకృష్ణ, ఆర్మీ రామయ్య, బొంతిరాళ్ల తిరుపాలు, మోహన్, మల్లెంపల్లి ఆనంద్ పాల్గొన్నారు.

### అనాథ సాధువుకు అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న స్వచ్ఛంద సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ దగ్గర గుర్తుతెలియని సాధువు(50) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. స్థానికులు గమనించి ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూర్ బాషాకు తెలిపారు. వారు పోలీసుల అనుమతితో మృతదేహాన్ని కొలుములపల్లె రస్తాలోని హిందూ శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు జెబీవుల్లా, పుల్లం రాజు పాల్గొన్నారు.

## సమాజసేవలో భాగస్వాములు కావాలి



సీహెచ్‌సీలో అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శేషారెడ్డి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సాగరిక, వైద్యురాలు వాణి స్వప్న ప్రియ అన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులు, వృద్ధులకు దాత దూదేకుల మస్తాన్ వలి సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధు సూదన్‌రెడ్డి , రాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వలిబాషా, విష్ణు మోహన్, మనోహర్ రెడ్డి, శివ గోపాల్, రాజు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు వన్యప్రాణులు అవసరం



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

డోన్: మానవాళి మనుగడకు పశుపక్ష్యాదులతో పాటు జంతువులు కూడా ఎంతో తోడ్పడతాయని అటవీశాఖ డీఆర్వో రవీంద్రనాయక్ అన్నారు. ప్యాపిలి మండలం సిద్దనగట్టు, కొమ్మేమర్రి గ్రామాల్లో వన్యప్రాణి సంరక్షణ గురించి స్థానికులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్టు సెక్షన్ అధికారి మౌలాలి, బీట్ అధికారి సునీత పాల్గొన్నారు.

### నేటి నుంచి ఆధార్ క్యాంపు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఆధార్ అప్‌డేట్‌కు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. 18, 24వ తేదీల్లో కోవెలకుంట్ల రెండో సచివాలయం, భీమునిపాడు, 19, 25వ తేదీల్లో కోవెలకుంట్ల-3, రేవనూరు, 20, 27వ తేదీల్లో కోవెలకుంట్ల-4, 5 సచివాలయాలు, బిజనవేముల, సొదరదిన్నె, 21, 28వ తేదీల్లో గుళ్లదూర్తి, చిన్నకొప్పెర్ల గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరం వివిధ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో నాల్గో తరగతి పూర్తి చేసుకునే విద్యార్థినులు ఐదో తరగతి ప్రవేశానికి, 10వ తరగతి విద్యార్థినులు ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మార్చి 6వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

### 22న మండల మీట్

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే సమావేశంలో విద్య, వైద్యం, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, వ్యవసాయ, గ్రామీణ నీటిసరఫరా, తదితర శాఖలపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల మండలస్థాయి అధికారులు సమావేశానికి విధిగా హాజరుకావాలని సూచించారు.

### విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని పురాతన గుండం ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన దక్షిణామూర్తి, నవనాగేంద్ర, మహాగణపతి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. వేదపండితులు కాణిపాకం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మొదటి రోజు గంగపూజ, గోపూజ, మహాగణపతి పూజ, కలశస్థాపన తదితర పూజలు చేశారు. మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం బుధవారం విగ్రహాల ప్రతిష్ఠ చేయనున్నారు. కోర్నపల్లెకు చెందిన భజన బృందం సభ్యులు భజనగీతాలు ఆలపించారు.

### ముగిసిన ఉత్సవాలు

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లలో జీర్ణోద్ధరణ గావించిన శివకేశవ ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు యంత్ర ప్రతిష్ఠ, గణపతి, నందీశ్వర, పార్వతీదేవి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కళాన్యాసం, బలిదానం, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

### 22 నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని మార్కీళ్ల చెలిమ వద్ద ఉన్న పార్వతి పరమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వల్లీదేవసేన సమేత సంతాన నవనాగసుబ్రమణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బత్తుల రామక్రిష్ణారెడ్డి తెలిపారు. మహాగణపతి పూజ, పుణ్యాహ వచనం, పంచగవ్యప్రాసన, కలశస్థాపన, అఖండ దీపస్థాపన, యాగశాల ప్రవేశం, యంత్రాభిషేకం, ప్రదోషకాల పూజలు, పారాయణాలు, అగ్ని ప్రతిష్టాపన, ప్రాణ ప్రతిష్టాపన తదితర కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

## నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

చాగలమర్రి: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీఆంజనేయస్వామి, సాయిబాబా ఆలయాల ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పులి చిన్న ఓబుళరెడ్డి సోమవారం తెలిపారు. ప్రథమ బహుమతి హోండా షైన్ మోటారు సైకిల్ (125సిసి), ద్వితీయ బహుమతిగా హోండా షైన్ (100 సిసి) మోటారు సైకిల్, ఆ తరువాత వరుసగా.. రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు దాతల సహకారంతో అందజేస్తామన్నారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ రూ.5వేల నగదును ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తామన్నారు. ఉదయం రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు చెల్లించాలని సూచించారు. వివరాలకు సెల్ 9866209294, 9391656076 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## వేడుకగా శివపార్వతుల కల్యాణం





ఆలయంలో ప్రతిష్టించిన రామలింగేశ్వరస్వామి ,శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

డోన్: స్థానిక పాతపేట రామాలయంలోలో పునర్నిర్మించిన రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు బచ్చు రామకృష్ణ, భీమయ్య, శ్రీనివాసులు, సుబ్బయ్య, జయశీలగుప్త ఆధ్వర్యంలో శివలింగ ప్రతిష్ఠ చేశారు. అనంతరం మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన అర్జున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, క్రిష్ణగిరి మాజీ ఎంపీపీ కేఈ జయన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జయన్న, ఉత్సవ కమిటీ సభ్యులు బచ్చు సురేశ్, నాగరాజు, రవిశంకర్, చక్రి, భార్గవ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



డోన్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డోన్ టౌన్: అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శేబారాణి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం డోన్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలను పెంచకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. యాప్‌ల పేరుతో అంగన్‌వాడీలపై తీవ్ర పనిభారం మోపుతున్నారని తెలిపారు. మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, అంగన్‌వాడీ సెంటర్లకు వంట గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయడంతో పాటు, మెడికల్ లీవ్ ఇవ్వాలని, మెనూ చార్జీలను పెంచాలని, అర్హులైన వారికి టీచర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్‌బేగంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు గుల్జార్, అనూష, సుమలత, శ్రీలక్ష్మీ, రాజేశ్వరి, వరలక్ష్మీ, సుబ్బలక్ష్మీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో..

- బనగానపల్లె రూరల్: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ధర్నా చేశారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి యల్లయ్య మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టీఏ బిల్లులు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందన అమలు చేయాలని, యాప్‌ల భారం తగ్గించి అన్ని యాప్‌లు ఒకే యాప్‌లో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీఓ ఉమామహేశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మీ, రేణుక, శ్రీదేవి, రోజారమణి, సుకన్య, బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎంఈఓపై ఆర్డీఓకు ఫిర్యాదు



ఆర్డీఓ నరసింహులుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం సభ్యులు

డోన్ టౌన్: గత 15 ఏళ్లుగా డోన్ మండల విద్యాధికారిగా పనిచేస్తున్న ప్రభాకర్‌ను మార్చాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు తెలుగు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ నరసింహులును కలిసి వినతి పత్రం అందజేశారు. సుదీర్ఘ కాలంగా ఇక్కడే పనిచేస్తుండడంతో ప్రైవేట్ విద్యా సంస్థలతో పరిచయాలు ఏర్పరుచుకొని వారికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు, అధిక ధరలకు పుస్తకాల విక్రయాలు చేస్తూ దోచుకుంటున్నా అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థి సంఘం సభ్యులు మధు, అజయ్, నవీన్ తదితరులు ఉన్నారు.

### పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

డోన్: ప్యాపిలి మండలం మెట్టుపల్లిలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మెట్టు రామలింగారెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం బుగ్గన అర్జున్ అమర్నాథ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి రాము, పోస్టుపసాద్, విఘ్నేశ్వర్‌రెడ్డి, ప్రేమసాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## గోరుమానుకొండలో పారిశుద్ధ్య పనులు



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్

బేతంచెర్ల: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని.. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బంది వీధులు, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.